సాక్షి
వికారాబాద్
గురువారం । 18 । జనవరి । 2024



ట్రాఫిక్‌కు చెక్ పడేనా?

వికారాబాద్ పట్టణ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. 8లో▸



శాశ్వత ఆధార్ సెంటర్లు

ఆధార్ నమోదు, సవరణల కోసం ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. 8లో▸



ఎదురుచూపులు!

గాంధీనగర్ సమీపంలో నిర్మిస్తున్న 'డబుల్' ఇళ్ల నిర్మాణం ఎప్పుడు పూర్తివుతుందోనని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

దరఖాస్తులకు గడువు పెంపు

అనంతగిరి: టీఎస్‌డబ్ల్యూఆర్ ప్రతిభా కళాశాలల్లో ఇంటర్‌లో ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువును ఈ నెల 20 వరకు పొడిగించారు. బుధవారం టీఎస్‌డబ్ల్యూఆర్ (శివారెడ్డిపేట) బాలుర కళాశాల ప్రిన్సిపల్ జేజే ప్రవీణ్ కుమార్ వివరాలు వెల్లడించారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్‌తో పాటు ఐఐటీ, నీట్ ప్రవేశ పరీక్షకు కోచింగ్ ఇస్తామని చెప్పారు. 5వ తరగతి ప్రవేశాల పరీక్ష దరఖాస్తుకు సైతం 20వరకు గడువు పొడిగించినట్లు వివరించారు.

నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు షాద్‌నగర్ డిపో మేనేజర్ ఉష బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలను 9959226287 నంబర్ ద్వారా విన్నవించి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

8న ఓటర్ల తుది జాబితా విడుదల

ఆర్డీవో అనంతరెడ్డి


ఇబ్రహీంపట్నం: ఫిబ్రవరి 8న ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తామని ఆర్డీవో అనంతరెడ్డి తెలిపారు. రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో గుర్తించబడిన వివిధ రాజకీయపక్షాల ప్రతినిధులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఓటర్ల నమోదు, మార్పులకు స్పెషల్ క్యాంపెయిన్ ఈనెల 20, 21 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయా తేదీల్లో 18 ఏళ్లు నిండిన యువత కొత్త ఓటర్‌గా నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలుంటే ఈనెల 29 లోపు తెలియజేయాలని ఆయా రాజకీయపక్షాల నేతలను కోరారు. సమావేశానికి కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఎం, టీడీపీల తరఫున ప్రతినిధులు హాజరయ్యారు.

గోరెంకల నర్సింహకు సన్మానం

మంచాల: మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సమాఖ్య రంగారెడ్డి జిల్లా చీఫ్ ప్రమోటర్‌గా ఎన్నికైన గోరెంకల నర్సింహ, మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల జిల్లా కమిటీ సభ్యుడు దూస వెంకటేశ్ ముదిరాజ్‌ను బుధవారం లోయపల్లి గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ.. సంఘం సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు.

టీం చేంజ్..?

అధికారుల్లో బదిలీ అలజడి
- గత ప్రభుత్వానికి వంతపాడారనే అపవాదు
- అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో 'హస్తం' ఎమ్మెల్యేల గెలుపు
- అధికార మార్పుతో మొదలైన ఆందోళన



వికారాబాద్: ప్రభుత్వ అధికారుల్లో అలజడి మొదలయింది. రాష్ట్రంలో జరిగిన అధికార మార్పే ఈ ఆందోళనకు కారణమయింది. ప్రభుత్వం మారడంతో పాటు అధికార పార్టీ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో క్లీన్ స్వీప్ చేసింది. దీంతో తమకు బదిలీ గండం తప్పదేమోనని అధికారులు ఆందోళన చెందుతున్నారు. పోలీసు, రెవెన్యూ శాఖలో ఈ ఆందోళన ఒకింత ఎక్కువగా కనిపిస్తోంది. మండలం నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు తమ మెడపై బదిలీ కత్తి వేలాడుతోందని జంకుతున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి, అప్పటి ఎమ్మెల్యేలకు అధికారులు వంతపాడారనే నెపంతో పాటుగా ప్రస్తుత ఎమ్మెల్యేలు పలువురు అధికారుల పనితీరుపై అసంతృప్తితో ఉండడమే బదిలీల యోచనకు కారణమని స్పష్టమవుతోంది. తాజాగా గెలుపొందిన ఎమ్మెల్యేలు ఇప్పటికే పలువురు అధికారులకు చివాట్లు పెట్టినట్లుగా ప్రచారం సాగుతోంది. కొందరు ఎమ్మెల్యేలు సభలు, సమావేశాల్లో బాహాటంగానే అధికారులపై ఆగ్రహం, అసంతృప్తి వ్యక్తం చేయంగా మరి కొందరు తమ మాటకు విలువ ఇవ్వడం లేదని ఫోన్‌లు చేసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఎంపీడీఓలు, తహసీల్దార్లు మొదలుకుని జిల్లా స్థాయి అధికారుల వరకు ఎమ్మెల్యేల ఆగ్రహానికి గురైన వారిలో ఉండడం గమనార్హం.

పైరవీలు ప్రారంభం..?

ఈ బదిలీల గండం అన్ని స్థాయిల అధికారులను వెంటాడుతోంది. జిల్లా నుంచి గెలుపొందిన నలుగురు శాసన సభ్యుల్లో ఒకరు సీఎంగా.. మరొకరు స్పీకర్‌గా ప్రాతినిధ్యం వహిస్తుండడంతో బదిలీలు ఖాయమనే చర్చకు బలం చేకూరుస్తోంది. జిల్లాలో 30కి పైగా శాఖల్లో (హెచ్‌ఓడీలు) జిల్లా అధికారులు ఉండగా అందులో 13 మంది అధికారులు దీర్ఘకాలికంగా (లాంగ్ స్టాండింగ్) ఇక్కడే ఉన్నారు. ఇందులో రెండు మూడు ప్రధాన శాఖల అధికారులపై ప్రస్తుత ఎమ్మెల్యేలు ఇప్పటికే అసంతృప్తి వ్యక్తం చేయగా వారి మార్పునకు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఎన్నికల్లో ప్రత్యక్షంగా విధులు నిర్వహించే పోలీసు, రెవెన్యూ శాఖల్లో ఎన్నికల ముందే బదిలీల ప్రక్రియ చేపట్టారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో బదిలీలపై వెళ్లిన తహసీల్దార్లు మళ్లీ ఆయా మండలాల్లో విధులు నిర్వహించేందుకు పైరవీలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. త్వరలో లోక్‌సభ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉండటం తాత్కాలికంగా ఇంకా కొన్ని నెలల పాటు వారు వచ్చే అవకాశం లేదు. పోలీసు శాఖలో కొందరిది పీరియడ్ పూర్తి కావడం మరి కొందరిపై ఎమ్మెల్యేల అసంతృప్తి ఉండడంతో తమ బదిలీ తప్పదా..? అనే ఆందోళన మొదలయింది.

నేతల హడావుడి

గత ప్రభుత్వ హయాంలో కొందరు అధికారులు తమకు వ్యతిరేకంగా పని చేశారని ఎమ్మెల్యేలే అసంతృప్తి వ్యక్తం చేయగా.. మరి కొందరు అధికారులపై ద్వితీయ శ్రేణి నాయకులు గుర్రుగా ఉన్నారు. పలానా అధికారి మనకు వ్యతిరేకంగా పని చేశాడు వారిని మార్చాలని ఎమ్మెల్యేల వద్ద పోరు పెడుతున్నారు. పోలీస్ శాఖలో ఎస్‌ఐలు, సీఐలు, డీఎస్పీలు ఇతర జిల్లా అధికాల విషయంలోనూ కనిపిస్తోంది. మరి కొన్ని చోట్ల ఎంపీడీఓలు, ఇంజనీరింగ్ విభాగంలో డీఈలు, ఏఈల విషయంలోనూ ఈ అసంతృప్తి వ్యక్తమవుతోంది. రెవెన్యూ శాఖలో కొందరు తహసీల్దార్లు, ఆర్‌ఐలు, డీటీలను సైతం మార్చేందుకు ప్రయత్నించాలని ఎమ్మెల్యేల వద్ద పోరు మొదలైనట్లు సమాచారం. అయితే కొన్ని చోట్ల ప్రస్తుతం ఆయా మండలాలు, నియోజకవర్గాలు, జిల్లా స్థాయిలో విధులు నిర్వహించే పలువురు అధికారులు ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునేందుకు యత్నిస్తున్నట్టు సమాచారం. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వారు ఇక్కడి నుండి బదిలీ కాకుండా జాగ్రత్త పడుతుండగా మరికొందరు ఇక్కడి నుంచి బదిలీపై వేరే ప్రాంతాలకు వెళ్లినవారు తిరిగి జిల్లాకు వచ్చేందుకు పావులు కదుపుతున్నారు.



బాధితురాలిని ఆటోలో సంగారెడ్డి ఆస్పత్రికి తీసుకెళ్తున్న బంధువులు

'108'కు డీజిల్ కరువు

బాధితురాలిని ఆటోలోనే ఆస్పత్రికి తరలించిన వైనం

మోమిన్‌పేట:ప్రమాదాల కారణంగా చావుబతుకుల మధ్యనున్న వారిని కాపాడే అపర సంజీవనికి బ్రేక్ పడింది. కుయ్.. కుయ్..మంటూ వచ్చే వాహనం రోడ్డెక్కని పరిస్థితి దాపురించింది. బూరుగుపల్లి గ్రామానికి చెందిన సాలమ్మ చిన్నారుల పోషణ భారంతో బుధవారం సాయంత్రం పురుగుమందు తాగింది. చికిత్స నిమిత్తం ఆమెను మోమిన్‌పేట ఆస్పత్రికి తరలించగా అక్కడి సిబ్బంది సంగారెడ్డి ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో వారు 108కు ఫోన్ చేయడంతో మోమిన్‌పేట 108 వాహనానికి సమాచారం అందింది. కానీ వాహనంలో డీజిల్ లేదని రాలేమని పైలట్ శ్రీకాంత్ బాధితురాలి బంధువులకు చెప్పాడు. వారు చేసేదేమీ లేక ఆటోలో సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి భర్త నాలుగేళ్ల క్రితమే ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. పేదలకు ఆపదలో ఆదుకునే 108 అక్కరకు రాకపోవడంతో బంధువులు ఒకింత అసహనం వ్యక్తం చేశారు.

ఎంఐఎం ఎమ్మెల్యేకు పౌర సన్మానం



ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్‌ను సన్మానిస్తున్న మోమిన్‌పేట గ్రామస్తులు

- బహదూర్‌పుర నుంచి భారీ మెజార్టీతో గెలిచిన మహ్మద్ ముబీన్
- అసెంబ్లీ మెట్లెక్కిన మోమిన్‌పేటవాసి

మోమిన్‌పేట: బతుకుదెరువు కోసం పట్నం బాట పట్టిన మహ్మద్ ముబీన్ బహదూర్‌పుర నుంచి భారీ మెజార్టీతో శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. దీంతో బుధవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆయనకు పౌరసన్మానం చేశారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ మాజీ చైర్మన్ నర్సింలుగుప్తా మాట్లాడుతూ.. మోమిన్‌పేట గ్రామానికి చెందిన ముబీన్ ఎమ్మెల్యేగా గెలుపొందడం గర్వంగా ఉందన్నారు. 1994లో బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లిన ముబీన్ కాంగ్రెస్‌లో చురుగ్గా పనిచేశారు. ఇది గుర్తించిన ఎంఐఎం అధినేత పార్టీలో చేర్చుకున్నారు. ఆయన నాలుగు పర్యాయాలు కార్పొరేటర్ ప్రజలకు సేవ చేశారని గుర్తు చేశారు. 2024 సాధారణ ఎన్నికల్లో ఎంఐఎం బహదూర్‌పుర నుంచి బరిలో దింపింది. ఆయన 67వేల పై చిలుకు మెజార్టీతో గెలుపొందడం తమ ప్రాంత ప్రజలకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. మా గ్రామం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తుండంతో గ్రామస్తులు, బంధుమిత్రులు, తనతో పాటు చదువుకున్న వారు ఎంతో ఆనందంతో ఈ కార్యక్రమ ఏర్పాటుకు ముందుకు వచ్చారన్నారు.

పుట్టిన గడ్డను మరువను: ఎమ్మెల్యే

అనంతరం ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ మాట్లాడుతూ.. తనకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులతోపాటుగా గ్రామస్తులు, స్నేహితులు అందరూ ముందుకు వచ్చి సన్మానించడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. పౌర సన్మానంతో ప్రాంతీయ అభిమానాన్ని చాటారన్నారు. గ్రామస్తుల ఆదరాభిమానాలతోనే రాజకీయాల్లో అంచలంచెలుగా ఎదిగానన్నారు. ఎంత ఎదిగిన తాను పుట్టిన ప్రాంతాన్ని మరువనని భావోద్వేగానికి లోనయ్యారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, సర్పంచ్ అంగేరి శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు ఆజం, అజీజ్, సమద్, వెంకట్, బస్వరాజ్‌స్వామి, సుభాష్‌గౌడ్, రవూఫ్, రాచప్ప, బల్వంత్‌రెడ్డి, ఎరాజ్, నారాయణరెడ్డి, మల్లయ్య, లాయక్‌అలీ తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న సీఐ రామాంజనేయులు

క్రీడలకు రాజకీయ రంగు

- రాజకీయ పార్టీ నేతల భాగస్వామ్యంతో క్రికెట్ పోటీలు
- ఫైనల్ మ్యాచ్‌లో తీవ్ర ఉత్కంఠ
- ముందుజాగ్రత్తగా పోలీసు బందోబస్తు
- విజేతగా చేజర్స్ టీం

యాచారం: నక్కర్తమేడిపల్లిలో సంక్రాంతి పండుగ సందర్భంగా జరిగిన క్రికెట్ పోటీలకు రాజకీయ రంగు పులుముకుంది. పండుగను పురస్కరించుకుని ఆయా రాజకీయ పార్టీల నాయకులు 8 జట్లతో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఐదు రోజుల పాటు జరిగిన ఈ పోటీలు ఉత్కంఠగా సాగాయి. రాజకీయ పార్టీల నాయకులు తమ జట్టు ఎలాగైనా గెలవాలని పోటీలో నిలిచే టీం సభ్యులకు నిత్యం మద్యం, మాంసంతో కూడిన విందు భోజనాలు అందించారు. రూ.వేలల్లో ఖర్చు చేసి దావత్‌లు ఏర్పాటు చేశారు. గ్రామస్తులు సైతం క్రికెట్ పోటీలో ఏ పార్టీ మద్దతుదారులు గెలుస్తారో అని వచ్చి ఆసక్తిగా చూశారు.

ఉత్కంఠగా ఫైనల్ మ్యాచ్..

మంగళవారం సాయంత్రం ఫైనల్‌లో ఓ మాజీ సర్పంచ్ ఆర్థిక సహకారంతో స్పార్టన్ జట్టు, ఎంపీటీసీ మాజీ సభ్యుడి ఆర్థిక సహకారంతో చేజర్స్ జట్లు తలపడ్డాయి. రెండు జట్లకు రాజకీయ పార్టీల నేతలు ఆర్థిక సహకారం చేయడంతో నువ్వా–నేనా అనే రీతిలో మ్యాచ్ కొనసాగింది. మ్యాచ్‌కు రాజకీయ రంగు పులుముకుందని గ్రహించిన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ సీఐ రామాంజనేయులు ముందు జాగ్రత్తగా బందోబస్తును ఏర్పాటు చేశారు. తీవ్ర ఉత్కంఠను రేపిన ఫైనల్ మ్యాచ్‌లో చివరకు చేజర్స్ టీం విజేతగా నిలిచింది. గెలుపొందిన టీంకు రూ.25వేల నగదు బహుమతి, ట్రోఫీని సీఐ అందజేశారు. ఫైనల్ మ్యాచ్ సాఫీగా ముగియడంతో గ్రామస్తులంతా ఊపిరి పీల్చుకున్నారు.

ముగిసిన జీపీఎల్

సంక్రాంతి సందర్భంగా గున్‌గల్‌లో కొనసాగిన జీపీఎల్ (గున్‌గల్‌ప్రీమియర్ లీగ్) క్రికెట్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ముగింపు పోటీలకు యాచారం సీఐ సైదయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. నేటి ఓటమి రేపటి గెలుపునకు నాంది అన్నారు. అనంతరం గెలుపొందిన వెంకటేశ్ జట్టుకు ట్రోఫీని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు.. మచ్చ లక్ష్మణ్, బాసాని బుచ్చిరెడ్డి, గిరిమోని రవి, కాశమల్ల యాదయ్య పలువురు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

'చౌక' దందా!

పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యం దళారులు, అక్రమార్కుల జేబులు నింపుతోంది. దందాను అరికట్టడంలో సంబంధిత అధికారులు విఫలమవుతున్నారు.

రేషన్ బియ్యం లూటీ చేస్తున్న దళారులు
- డీలర్లతో సత్సంబంధాలు
- పౌల్ట్రీఫారాలకు, రైస్‌మిల్లులకు తరలింపు



పరిగి: పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం కోట్లు వెచ్చిస్తూ చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తోంది. రూపాయికి కిలో చొప్పున అందిస్తున్న ఈ బియ్యం అక్రమార్కుల జేబులు నింపుతోంది. బియ్యం దొడ్డుగా ఉండటం, నాణ్యత లేకపోవడంతో కొందరు తినేందుకు ఇష్టపడటం లేదు. ప్రతీ నెల లబ్ధిదారులు రేషన్ దుకాణాల నుంచి బియ్యం తీసుకుంటున్నా వాటిని నేరుగా రూ.10 కిలో చొప్పున విక్రయిస్తున్నారు. మరికొందరు మిల్లుల వద్ద అమ్ముతున్నారు. పరిగి పట్టణ కేంద్రంలో ప్రతీ శుక్రవారం వందల కిలోల రేషన్ బియ్యం పక్కదారి పడుతోందని చర్చలు వినిపిస్తున్నాయి.

రెండోసారి రీసైక్లింగ్

జిల్లా వ్యాప్తంగా 19 మండలాల్లో 588 రేషన్ దుకాణాలున్నాయి. 2.41లక్షల రేషన్ కార్డులకు అన్ని దుకాణాల్లో కలిపి తొమ్మిది వేల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నారు. వ్యాపారస్తులు, మిల్లర్లు మాఫియాగా మారి రేషన్ బియ్యం కొనుగోలు చేసి బియ్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారు. వీటిని రెండోసారి రీసైక్లింగ్ చేస్తున్నారు. కొంతమంది కర్ణాటక, మహారాష్ట్రకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దందాతో అక్రమార్కులు ప్రజాధనాన్ని కోట్లలో కొల్లగొడుతున్నారు. అధికారుల పర్యవేక్షణలోపం.. ఓ రాజకీయ నాయకుడి అండదండలతో అక్రమార్కుల వ్యాపారం మూడు బస్తాలు.. ఆరు క్వింటాళ్లుగా సాగుతోందని పలువురు విమర్శిస్తున్నారు.

విఫలమవుతున్న అధికారులు

రేషన్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు భద్రత కట్టుదిట్టం చేసినా వ్యాపారం కొనసాగుతూనే ఉంది. రేషన్ లబ్ధిదారులకు డబ్బును ఎరగా చూపి ఇష్టానుసారంగా కొనుగోలు చేస్తున్నారు. నాలుగైదు గ్రామాలకు కలిపి ఒక వ్యక్తి బియ్యాన్ని కొనుగోలు చేసి వ్యాపారం చేస్తున్నారు. కొంత మంది వ్యాపారులు పౌల్ట్రీ ఫారంలకు క్వింటాళ్ల కొద్ది తరలిస్తున్నారు. అధికారులు అడ్డుకట్ట వేసేందుకు యత్నించినా రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గక తప్పడం లేదు. దీంతో ప్రజలు రెవెన్యూ అధికారులు, పోలీసులు దందా అరికట్టడం విఫలమవుతున్నారని ఆరోపిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

రేషన్ బియ్యం తరలించే అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం. జిల్లాలో ఇందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నాం. రేషన్ దుకాణాల్లో ఎలాంటి అక్రమాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. రేషన్ అక్రమంగా నిల్వ ఉంచినా కఠిన చర్యలు తప్పవు.

– ఆనంద్‌రావు, తహసీల్దార్, పరిగి

అవిశ్వాస 'పురం'పర

ఆశావహుల ఆశలు నెరవేరేనా?
- కొన్ని మున్సిపాలిటీల్లో కొనసాగుతున్న క్యాంపులు
- మరికొన్ని చోట్ల తిరిగొచ్చిన కౌన్సిలర్లు
- ఏం జరుగుతుందోనని స్థానికంగా చర్చోపచర్చలు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: పాలకమండళ్ల గడువు దగ్గర పడుతున్న కొద్దీ జిల్లాలోని పలు నగర/పురపాలికల్లో రాజకీయం రసవత్తరంగా మారుతోంది. ఈ నెల 28తో పాలక మండళ్ల ఏర్పడి నాలుగేళ్లు పూర్తవుతోంది. ఇప్పటికే పలువురు మేయర్లు, చైర్మన్లు, చైర్ పర్సన్లపై అవిశ్వాస తీర్మానానికి నోటీసులు కూడా ఇచ్చారు. నోటీసులు ఇచ్చిన వారిలో కొంత మంది క్యాంపులకు వెళ్లారు. వీరిలో కొంత మంది తిరిగి రాగా, మరికొంత మంది అక్కడే ఉండిపోయారు. ఇంతకీ వారికి వ్యతిరేకంగా తీర్మానం ఉంటుందా? ఈ నోటీసులపై కలెక్టర్ ఏం నిర్ణయం తీసుకోనున్నారు? అనే అంశాలపై చర్చ జరుగుతోంది. మేయర్, చైర్మన్ పీఠాలను దక్కించుకోవాలనే కల నెరవేరుతుందా? లేదా అనే ప్రశ్న ఆశావహుల్లో వ్యక్తమవుతోంది. ఇచ్చిన నోటీసులపై ఒక వైపు తీవ్రమైన సందిగ్ధత కొనసాగుతుండగా, మరోవైపు షాద్‌నగర్, తుర్కయంజాల్ మున్సిపాలిటీలు, బడంగ్ పేట్ కార్పొరేషన్‌లోని ఆశావహులు తెరవెనుక పావులు కదుపుతున్నారు.

ఆదిబట్ల.. తేలేదెట్లా..!

ఆదిబట్ల మున్సిపల్ చైర్‌పర్సర్ ఆర్తిక(కాంగెస్)పై అదే పార్టీకి చెందిన కౌన్సిలర్లు జనవరి 9న అదనపు కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానానికి నోటీసులు ఇచ్చారు. మున్సిపాలిటీలో 15 మంది అభ్యర్థులు ఉండగా, వీరిలో 13 మంది నోటీసులపై సంతకాలు పెట్టారు. ఆ తర్వాత 12 మంది క్యాంపు (రాజమండ్రి, వైజాగ్, బీమవరం)నకు వెళ్లారు. తాజాగా బుధవారం ఉదయం క్యాంపు నుంచి తిరిగి వచ్చారు. చైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్న ఓ కౌన్సిలర్ తనతో పాటు క్యాంపునకు వచ్చిన వారికి భారీగా ప్యాకేజీ ముట్టజెప్పినట్లు తెలిసింది.

బండ్లగూడ .. ఒత్తిడి తెచ్చినా కూడా

బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ అభ్యర్థి లతా ప్రేమ్‌గౌడ్‌పై 16 మంది (బీజేపీ నుంచి ఒకరు, కాంగ్రెస్ నుంచి ఇద్దరు, బీఆర్‌ఎస్ నుంచి 13 మంది) తిరుగుబావుటా ఎగురవేశారు. మొత్తం 22 మంది కార్పొరేటర్లు ఉండగా, వీరిలో ఒకరు మృతి చెందారు. వీరంతా ఇటీవల కలెక్టర్ శశాంకను కలిసి నోటీసులు అందజేశారు. అదే రోజు క్యాంపునకు వెళ్లారు. నిన్నటి వరకు ఏపీలో ఉన్న నేతలు తాజాగా బుధవారం బెంగళూరుకు చేరుకున్నారు. కేవలం ఆరు నెలల కోసం అవిశ్వాస తీర్మానం పెట్టడం సరైన నిర్ణయం కాదని, క్యాంపు నుంచి తిరిగి రావాల్సిందిగా స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ వారిపై ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. వచ్చే ఎన్నికల్లో పోటీకి అవకాశం ఇవ్వబోమని హెచ్చరించినా వారు ససేమిరా అనడం విశేషం. నోటీసులిచ్చి రోజులు గడుస్తున్నా..ఇప్పటి వరకు అధికారులు అవిశ్వాస తీర్మానానికి ఏర్పాట్లు చేయకపోవడంతో క్యాంపుల్లోకి వెళ్లిన వారిలో ఆందోళన మొదలైంది. అసలు అవిశ్వాస తీర్మానం ఉంటుందా? లేదా అనే సందేహం వ్యక్తమవుతోంది.

షాద్‌నగర్.. కౌన్సిలర్ల గుర్రు

షాద్‌నగర్ చైర్మన్‌పై కూడా కాంగ్రెస్ కౌన్సిలర్లు గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు ఎమ్మెల్యే వర్గీయులు ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాతపై కూడా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు కొంతమంది సభ్యులు తెరవెనుక పావులు కదుపుతున్నట్లు తెలిసింది. తుర్కయంజాల్ మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలని తొలుత భావించినప్పటికీ.. ఆ తర్వాత చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల మధ్య వారు వెనక్కి తగ్గినట్లు సమాచారం.

'పట్నం'.. తప్పని కలవరం

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో బీజేపీకి రెండు, కాంగ్రెస్‌కు ఆరు, బీఆర్‌ఎస్‌కు 16 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కప్పరి స్రవంతిని చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. ప్రస్తుతం 17 మంది కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ మేరకు జనవరి 8న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు నోటీసులు ఇచ్చి, ఆ వెంటనే 11 మంది క్యాంపు(గోవా)నకు వెళ్లిపోయారు. నోటీసులు అందజేసి పది రోజులైనా ఇప్పటి వరకు బలప్రదర్శనకు ఏర్పాట్లు చేయకపోవడంతో క్యాంపుల్లో ఉన్న వారిలో ఆందోళన మొదలైంది.

పెద్ద అంబర్‌పేట .. వీడేనా ఉత్కంఠ?

పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలో 24 వార్డులు ఉండగా, వీటిలో కాంగ్రెస్ 13, బీఆర్‌ఎస్ 8, బీజేపీ 1, సీపీఐ ఒకటి, ఇండిపెండెంట్ ఒకటి చొప్పున గెలుపొందారు. ఎక్స్ అఫీషియో సభ్యులు, కాంగ్రెస్‌లోని మరికొంత మంది కౌన్సిలర్ల సహకారంతో అప్పటి బీఆర్‌ఎస్ అభ్యర్థి చవుల స్వప్న చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా కాంగ్రెస్ అభ్యర్థిని ఎన్నుకున్నారు. అప్పటి వరకు బీఆర్‌ఎస్‌లో కొనసాగిన చైర్ పర్సన్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరారు. గత జనవరి 28న 15 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతూ అప్పటి కలెక్టర్‌కు నోటీసులు ఇచ్చారు. చైర్మన్, వైస్ చైర్మన్ ఒక గ్రూపు, పార్టీలకు అతీతంగా కౌన్సిలర్లు మరో గ్రూపు ఇలా రెండు గ్రూపులు 25 రోజుల పాటు క్యాంపునకు వెళ్లారు.హైకోర్టు స్టే విధించడంతో పాటు ప్రభుత్వం కూడా ఏ నిర్ణయం తీసుకోలేదు.దీంతో క్యాంపునకు వెళ్లిన వారంతా తిరిగి వచ్చేశారు. గతంలో ఇచ్చిన నోటీసులనే పరిగణలోకి తీసుకుంటురా?లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. స్థానిక ఎమ్మెల్యే ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే అంశంపై చర్చ కొనసాగుతోంది.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తి గేటు వద్ద ఉన్న మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలలో ఐదవ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గంగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 4వ తరగతి విద్యార్థులు.. ఆధార్‌కార్డు, బోనఫైడ్, పాసు ఫొటోతో పాఠశాలకు వస్తే ఉచితంగా ఆన్‌లైన్ దరఖాస్తు చేస్తామన్నారు. మిగతా వివరాల కోసం 89786 71075, 63051 47525 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి: ఎస్‌ఐ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ శ్రీశైలం

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను తెలుసుకోవాలని కుల్కచర్ల ఎస్‌ఐ శ్రీశైలం అన్నారు. బుధవారం కుల్కచర్లలో ఆయన వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి బైకిస్టు హెల్మెట్ ధరించాలని కోరారు. ఫోర్‌వీలర్స్ నడిపేవారు సీటుబెల్టు ధరించాలని, వాహనదారులందరూ తప్పనిసరిగా వాహనాలకు సంబంధించిన ధృవపత్రాలను దగ్గర ఉంచుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

యువకుడి ఆత్మహత్య



నరేష్ (ఫైల్)

కేశంపేట: ఫిట్స్ రోగంతో బాధపడుతున్న యువకుడు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని కొండారెడ్డిపల్లిలో ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండారెడ్డిపల్లికి చెందిన లింగారం నరేష్ (23) కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలో నివసిస్తున్నాడు. రోజూ మాదిరిగా ఈనెల 12న అందరితో కలిసి రాత్రిపూట భోజనం చేసిన నరేష్ వేరే గదిలో నిద్రించగా కుటుంబ సభ్యులు మరో గదిలో నిద్రించారు. ఉదయం లేచిన కుటుంబ సభ్యులకు నరేష్ కన్పించకపోవడంతో బంధువుల ఇళ్లలో, చుట్టుపక్కల వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. అయితే బుధవారం గ్రామ శివారులోని చెరువులో నరేష్ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కుటుంబ సభ్యులు వచ్చి చూడగా అతడు నరేష్ అని గుర్తించారు. మృతుడికి ఫిట్స్ సమస్య ఉండటంతో బాధపడేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి అక్క జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారి దుర్మరణం



కీర్తన మృతదేహం

కందుకూరు: రోడ్డు ప్రమాదం ఓ చిన్నారిని చిదిమేసింది. ఈ దుర్ఘటన కందుకూరు పీఎస్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సైదులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని దాసర్లపల్లికి చెందిన ఎరగమోని రాజు తన కుమార్తె కీర్తన(12), కుమారుడు శ్రీశాంత్‌తో కలిసి బైక్ కందుకూరుకు వచ్చాడు. సాయంత్రం తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నారు. సాయంత్రం 6.30గంటల ప్రాంతంలో శ్రీశైలం రహదారిపై దెబ్బడగూడ గేట్ సమీపంలో ఎదురుగా వస్తున్న ఇన్నోవా వీరిబైక్‌ను ఢీకొట్టింది. దీంతో కిందపడ్డ చిన్నారి కీర్తన అక్కడికక్కడే మృతి చెందింది. తండ్రీకుమారులు స్వల్పంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్‌కు చెక్ పడేనా?



కొనసాగుతున్న నూతన ఫ్లై ఓవర్ పనులు

- శరవేగంగా ఫ్లైఓవర్ నిర్మాణ పనులు
- ఆర్‌ఓబీ పక్కనే సమాంతరంగా నూతన బ్రిడ్జి
- పూర్తయితే తీరనున్న వాహనదారుల ఇబ్బందులు

వికారాబాద్ అర్బన్: పట్టణ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. బ్రిడ్జి పనులు పూర్తయితే జిల్లా కేంద్రానికి వచ్చీపోయె వాహనాలతో ఏర్పడే ట్రాఫిక్ ఇబ్బందులు తీరనున్నాయి. వికారాబాద్ పట్టణంలోకి రావాలన్నా, పట్టణం నుంచి హైదరాబాద్, ఇతర పట్టణాలకు వాహనాలు పోవాలన్నా ఆర్టీసీ డిపో సమీపంలోని ఈ ఒక్క రైల్వే బ్రిడ్జి (ఆర్‌ఓబీ) మాత్రమే దిక్కు. మరో ప్రత్యామ్నాయ రోడ్డు లేదు. సుమారు 30 ఏళ్ల క్రితం రెండు వాహనాలు ఒకేసారి వెళ్లే విధంగా బ్రిడ్జిపై డబుల్ రోడ్డు వేశారు. అప్పటి వాహనాల సంఖ్యకు ఆ రోడ్డు సరిపోయింది. ప్రస్తుతం వికారాబాద్ పట్టణం విస్తరించడంతో పాటు వాహనాల సంఖ్య బాగా పెరిగింది. పైగా పాత బ్రిడ్జి పలుచోట్ల కుంగిపోయి ప్రమాదాలకు కారణమవుతుంది. రెండువైపులా ఉన్న రేలింగ్ కూడా శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు రెండు చోట్ల ఒంపులుగా ఉండటంతో తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఆర్‌ఓబీకి సమాంతరంగా ఫ్లైఓవర్..

ఈ సమస్యకు పరిష్కారం కోసం పాత బ్రిడ్జి పక్కనే మరో ఫ్లైఓవర్ నిర్మించాలని ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్ణయించారు. గతేడాది కాలంగా బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రయత్నం చేస్తున్నా ఓ ప్రైవేటు స్థలం ఫ్లైఓవర్ నిర్మాణంలో పోతుండటంతో ఆ స్థలాన్ని సేకరించడం, సంబంధిత ట్రస్టు నిర్వాహకులను ఒప్పించడానికి సమయం పట్టింది. ఎట్టకేలకు ఇటీవల స్థల సేకరణ పనులు పూర్తికావడంతో ప్రభుత్వం రూ.92కోట్లను ఫ్లైఓవర్ నిర్మాణానికి నిధులు కేటాయించింది. దీంతో వారం రోజులుగా ఫ్లైఓవర్ పనులు చురుకుగా సాగుతున్నాయి. బ్రిడ్జి నిర్మాణంపై స్థానిక ఎమ్మెల్యే, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. మొదటి విడతగా రూ.72కోట్లను ఇటీవలే మంజూరు చేయించినట్లు ఆయనే ఓ సమావేశంలో తెలిపారు. సకాలంలో బ్రిడ్జి పనులు పూర్తయితే పట్టణ ప్రజల ఇబ్బందులు తీరనున్నాయి.

త్వరగా పూర్తిచేయాలి



వికారాబాద్‌లోని పాత ఆర్‌ఓబీ బ్రిడ్జి పక్కనే ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టడం సంతోషకరం. ఈ నిర్మాణంతో వాహనాల రాకపోకలకు సౌకర్యవంతంగా ఉంటుంది. పనులపై ప్రత్యేక చొరవ తీసుకుంటున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు ధన్యవాదాలు. ఫ్లైఓవర్ పనులను త్వరగా పూర్తిచేయాలి. ఈ నిర్మాణంతో ప్రమాదాలను అరికట్టవచ్చు.

– రాజు, అడ్వకేట్, వికారాబాద్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మనోహర్‌రెడ్డి, ఉపాధ్యాయులు

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని క్యాంప్ కార్యాలయం వద్ద టీఎస్ యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమవ్వడంతో ఆపటు పూర్తిగా భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. సీఎంతో మాట్లాడి 317 జీఓలో నష్టపోయిన ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు రాములు, నర్సింహులు, నారాయణగౌడ్, వెంకటప్ప, భాను చైతన్య, గోపాల్, నర్సయ్య నాయక్, మహేందర్, గోవర్ధన్, ప్రకాష్‌గౌడ్, సువర్ణరాణీ, మాణేమ్మ, మంజుశ్రీ, శాంత ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

దోమ: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ మహిళా మృతి చెందిన ఘటన దోమ మండల పరిధిలోని దాదాపూర్ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుల్కచర్ల మండలం సాల్వీడ్ గ్రామానికి చెందిన డప్పు బాబమ్మ(35) దౌల్తాబాద్ మండలంలోని అల్లాపూర్ గ్రామంలోని తన అత్తగారి ఇంటికి బుధవారం ఓ వ్యక్తి బైక్‌పై వెళ్తోంది. అదే క్రమంలో వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం వారిని ఢీకొట్టడంతో బాబమ్మ అక్కడికక్కడే మృతి చెందగా.. బైక్ నడిపే వ్యక్తికి స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతు ప్రాణం తీసిన కంచె

- అడవి పందుల బారినుంచి కాపాడేందుకు మొక్కజొన్న చేను చుట్టూ విద్యుత్ ఫెన్సింగ్
- గమనించక తాకి రైతు దుర్మరణం
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన



శంకర్ నాయక్ (ఫైల్)

మహేశ్వరం: అడవి పందుల బారినుంచి రక్షణ కోసం మొక్కజొన్న చేను చుట్టూ పెట్టిన విద్యుత్ వైర్లు ఓ రైతును బలితీసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహేశ్వరం సీఐ ముని, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెద్దమ్మ తండా గ్రామ పంచాయతీకి అనుబంధంగా ఉన్న నల్లచెర్వు తండాకు చెందిన పాత్లవత్ శంకర్(58) చిన్నతూప్రకి చెందిన ఓ రైతు వద్ద భూమిని కౌలుకు తీసుకొని గత కొన్నిరోజుల నుంచి సాగు చేస్తున్నాడు. ఆ పొలంలో అంజయ్య అనే రైతు మొక్కజొన్న పంటను సాగు చేస్తుండగా పంటను అడవి పందులు నాశనం చేస్తున్నాయి. వాటి బెడద నుంచి తప్పించేందుకు మొక్కజొన్న పంట చుట్టూ అంజయ్య విద్యుత్ వైర్లు ఏర్పాటు చేసి వాటికి విద్యుత్ సరఫరా పెట్టాడు. మంగళవారం ఉదయం శంకర్ నాయక్(58) అనే రైతు ఆ విద్యుత్ వైర్లు గమనించకుండా తాకడంతో అక్కడికక్కడే విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వైర్లలో కరెంట్ సప్లై పెట్టిన రైతు అంజయ్య గమనించి శంకర్ నాయక్ మృతదేహాన్ని పొలానికి దూరంగా వేసి తనకేమి తెలియనట్లు వ్యవహరించాడు. బుధవారం అదే గ్రామానికి చెందిన తిరుపతయ్య అనే పక్క పొలం రైతు శంకర్ నాయక్ మృతదేహాన్ని గమనించి వెంటనే గ్రామపెద్దలకు, పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే ఎస్‌ఐ సుబ్బారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. పందుల నుంచి రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లకు తాకి మృతి చెందాడని నిర్ధారించారు. పొలంలో విద్యుత్ వైర్లు అమర్చి శంకర్ నాయక్ మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని మృతుడి బంధువులు డిమాండ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

వారం రోజుల్లో శాశ్వత ఆధార్ సెంటర్లు

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు టౌన్: ఆధార్ నమోదు, సవరణల కోసం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అధికారులతో అన్నారు. పట్టణంలోని పాత మున్సిపల్ భవనంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ప్రజలతో ఆయన మాట్లాడారు. గతంలో పట్టణంలో ఏర్పాటు చేసిన ఒకే ఒక ఆధార్ సెంటర్ వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఈ సమస్యను పరిష్కరించడం కోసం పట్టణంలో మూడు ఆధార్ సెంటర్‌లను ఏర్పాటు చేయించినట్లు చెప్పారు. వారం రోజుల తర్వాత పట్టణంతో పాటు మండల కేంద్రాల్లో సైతం శాశ్వత ఆధార్ సెంటర్ల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ప్రజలకు ఆధార్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. తాండూరు పట్టణం, తాండూరు మండలానికి సంబంధించిన అడ్రస్ మార్పిడి మాత్రం ప్రస్తుతం జరగడం లేదని, మిగిలిన మండలాలకు సంబంధించి కొత్త ఆధార్‌కార్డు జారీ తప్ప మిగిలిన అన్ని సేవలు పొందవచ్చని నిర్వాహకులు తెలిపారు. అలాగే కొత్త ఆధార్ కార్డుల సేవలు మాత్రం ఎవరికీ అందుబాటులో లేవన్నారు. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు మొత్తం 150 టోకెన్లు ఇస్తామన్నారు. పెద్దేముల్ జెడ్పీటీసీ ధారాసింగ్, కౌన్సిలర్లు రత్నమాల, మధుబాల, మమత, ప్రభాకర్ గౌడ్, నాయకులు సర్దార్‌ఖాన్, హబీబ్‌లాలా, వెంకటయ్య, శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆధార్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

ఉర్సుకు సర్వం సిద్ధం

- నేటి నుంచి జేపీ దర్గా ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు



జేపీ దర్గా

కొత్తూరు: ప్రఖ్యాతి గాంచిన హజ్రత్ జహంగీర్ పీర్ దర్గా ఉర్సుకు సంబంధించిన ఏర్పాట్లను వక్ఫ్‌బోర్డు అధికారులు దాదాపుగా పూర్తిచేశారు. ఈనెల 18 నుంచి 20 వరకు దర్గా ఉత్సవాలు జరగనున్నాయి. శంషాబాద్ ఏసీపీ, కొత్తూరు సీఐ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు. దర్గా చరిత్రను ఒకసారి పరిశీలిస్తే.. కొత్తూరు మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామ శివారులోని జహంగీర్ పీర్ దర్గా రాష్ట్రంలోనే అత్యంత ప్రసిద్ధి గాంచింది. మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తూ ఓ ప్రత్యేక స్థానాన్ని కల్పించుకుంది. క్రీ.శ 15వ శతాబ్దంలో మొఘల్ చక్రవర్తుల కాలంలో ఇరాక్ దేశానికి చెందిన సయ్యద్ గౌసొద్దీన్, బురానొద్దీన్ అనే ఇద్దరు సోదరులు ఇన్ముల్‌నర్వలోని దట్టమైన అటవీ ప్రాంతానికి వచ్చారు. వారు ఇక్కడే కొంత కాలం పాటు ఉంటూ తమ కులదైవాన్ని స్మరించుకుంటూ కాలధర్మం చెందారు. తదనంతరం వీరి సమాధులపైనే చిన్న దర్గాలను నిర్మించారు. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు దక్కన్‌పై దండెత్తి వచ్చిన సమయంలో అతని కొలువులో ఉన్న పండితుడొకరు దర్గాను దర్శించి దాని విశిష్టతను గుర్తించి ఔరంగజేబుకు తెలిపారు. దీంతో మొగల్ చక్రవర్తి అయిన ఔరంగజేబు దర్గాను దర్శించుకుని సలామ్ అని నమస్కరించగా సమాధుల నుంచి ప్రతి సలామ్(వాలేకుమ్ అస్సలామ్) అనే శబ్దం వచ్చిందని చెబుతారు. దర్గా మహాత్మ్యాన్ని గుర్తించిన చక్రవర్తి 16వ శతాబ్దంలో ఇబ్రహీం అలీ అనే పండితుడిని దర్గాకు సంరక్షకుడిగా నియమించడంతో పాటు దాని అభివృద్ధికి సహకరించాడు. అప్పటి నుంచి ఈ దర్గా ప్రాచుర్యం పెరుగుతూ వచ్చి నేడు ప్రసిద్ధి గాంచింది.

ఏర్పాట్లు పూర్తి...

ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వక్ఫ్‌బోర్డు, పోలీసు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు బాబా(సమాధి) దర్శనం ఉంటుంది. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో మూడు రోజులు పాటు దర్గా ఆవరణలోకి ఎలాంటి వాహనాలను అనుమతించకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. దర్గాకు చేరుకునే రెండు రోడ్లలోనూ పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలను లోపలికి వెళ్లకుండా పార్కింగ్ స్థలానికి చేరుకునేలా చర్యలు చేపట్టారు.

కాలుష్య కోరల్లో నర్సప్పగూడ



చీకటి పడిందంటే ఇలా..



పగటిపూట పరిశ్రమ నుంచి వదులుతున్న పొగ

నందిగామ: నందిగామ మండలం నర్సప్పగూడ శివారులోని చేగూరు రోడ్డు వద్ద గల ఓ పరిశ్రమ వెదజల్లుతున్న కాలుష్యం ఇది. పగలు అంతంత మాత్రమే వదులుతున్న యాజమాన్యం.. సాయంత్రం అయ్యిందంటే చాలు ఎక్కువ మొత్తంలో వదలటంతో నల్లటి పొగ ఆ ప్రాంతాన్నంతా కమ్మేస్తోంది. మంగళవారం సాయంత్రం పరిశ్రమ వెదజల్లే కాలుష్యం 'సాక్షి' కెమెరాకు చిక్కింది. చీకటి పడిందో ఇక ఆ రోడ్డు మీదుగా వెళ్లాంటే నరకమే. నల్లటి బూడిద, పొగ ఆ ప్రాంతమంతా విస్తురించడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా ఆ ప్రాంత రైతుల బాధలు వర్ణణాతీతంగా మారాయి. పంటలు, పశుగ్రాసంపై నల్లటి బూడిద పడటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పరిశ్రమ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

విద్యుత్ అక్రమ వినియోగంపై చర్యలు

ఏఈ సందీప్‌కుమార్

యాచారం: వ్యవసాయానికి ఇచ్చే ఉచిత విద్యుత్ అక్రమ వినియోగానికి పాల్పడితే కేసులు నమోదు చేస్తామని మండల విద్యుత్ ఏఈ సందీప్‌కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని కొన్ని గ్రామాల్లో కొందరు వ్యవసాయ రంగానికి అందిస్తున్న ఉచిత విద్యుత్‌ను ఇతర అవసరాలకు వాడుకుంటూ దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. అలాంటివి ఏవైనా ఉంటే వెంటనే విరమించుకోవాలని.. లేని పక్షంలో కేసులు నమోదు చేసి.. భారీగా జరిమానాలు విధించాల్సి వస్తుందని హెచ్చరించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా సాఫీగా జరిగే విధంగా మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

బుక్ కీపర్ చేతివాటం

- మహిళా సంఘం అకౌంట్‌లో డబ్బులు కాజేసిన వైనం
- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన
- ఏపీఎంకు ఫిర్యాదు చేసిన సభ్యులు



ఏపీఎంకు ఫిర్యాదు చేస్తున్న మహిళా సంఘం సభ్యులు

దోమ: మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తే ఓ గ్రామ సంఘం సహాయకుడు (బుక్ కీపర్) అందులో నుంచి కొంత డబ్బును కాజేసిన ఘటన దోమ మండల పరిధిలోని మోత్కూర్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన శివశ్రీ మహిళా సంఘానికి 2022 ఆగస్టు 30న రూ.7.50 లక్షల రుణం మంజూరు అయ్యింది. అయితే అట్టి రుణాన్ని గ్రామంలో గ్రామ సంఘం సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్న కటికే మల్లేశం మహిళలకు ఇప్పించేందుకు బ్యాంకుకు తీసుకెళ్లాడు. మొత్తం రూ.7.50 లక్షలు మంజూరైతే అందులో నుంచి మహిళలకు రూ.5 లక్షలు అకౌంట్‌లోకి వేయించి, మిగత రూ.2.50 లక్షలు బ్యాంకులో ఉంటాయని మహిళలను మభ్యపెట్టాడు. అట్టి డబ్బులను తిరిగి అతని భార్య కటిక రజిత అకౌంట్‌లోకి వేయించుకున్నాడు. రెండేళ్ల తర్వాత సంఘం సభ్యులకు అనుమానం రాగా బ్యాంకుకు వెళ్లి అకౌంట్ స్టేట్‌మెంట్ తీయించారు. దాంట్లో మహిళలకు రూ.7.50 లక్షలు బదిలీ అయినట్లు కనిపించడంతో మహిళా సంఘం సభ్యులు ఖంగుతిన్నారు. తమకు రూ.5 లక్షలు మాత్రమే వచ్చాయని, మిగతా డబ్బులు రాలేదని బ్యాంకు మేనేజర్‌ను ఆరా తీయగా.. బ్యాంకు మెనేజర్ పూర్తి డేటాను బయటకు తీశారు. రూ.2.50 లక్షలు బుక్ కీపర్ భార్య అకౌంట్‌లోకి బదిలీ అయినట్లు గుర్తించారు. తదనంతరం సభ్యులు వెళ్లి బుక్ కీపర్‌ను నిలదీశారు. డబ్బులు ఇవ్వాలని అడిగితే పొంతన లేని సమాధానం ఇస్తున్నాడని సభ్యులు ఆరోపించారు.

పంచాయితీ పెట్టినా ఇవ్వని వైనం..

ఈ క్రమంలో కొన్నిరోజుల క్రితం గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ ఆధ్వర్యంలో.. కాజేసిన డబ్బులను తిరిగి ఇప్పించాలని మహిళా సంఘం సభ్యులు పంచాయితీ పెట్టారు. డబ్బులు ఇచ్చేందుకు బుక్ కీపర్ సమయం కోరగా సంఘం సభ్యులు ఏకీభవించారు. అయితే ఇచ్చిన సమయం దాటినా డబ్బులు ఇవ్వకపోవడంతో బుధవారం ఏపీఎం సురేశ్‌కు ఫిర్యాదు చేశారు. తమకు వచ్చిన రుణంలో కొంత డబ్బును బుక్ కీపర్ కాజేశాడని, ఇవ్వమంటే ఇవ్వడం లేదని ఏపీఎం ముందు వాపోయారు. తమ డబ్బులను ఇప్పించి సదరు బుక్‌కీపర్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

చర్యలు తీసుకుంటాం



డబ్బులు కాజేసిన విషయం మహిళా సంఘం సభ్యులు మా దృష్టికి తీసుకువచ్చారు. గురువారం గ్రామ సంఘం సమావేశం నిర్వహించి పూర్తి స్థాయిలో పరిశీలిస్తాం. కాజేసినట్లు తెలితే అట్టి డబ్బులను రికవరీ చేయించి మహిళా సంఘం సభ్యులకు అందజేస్తాం. సదరు బుక్ కీపర్‌పై చర్యలు తీసుకుంటాం.

– సురేశ్, ఏపీఎం, దోమ

గంజాయి పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

శంకర్‌పల్లి: గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని మోకిల సీఐ వీరబాబు పేర్కొన్నారు. సీఐ తెలిపిన వివరాలు.. మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంద్రారెడ్డినగర్ ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డులో ముగ్గురు వ్యక్తులు గంజాయితో ఉన్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందడంతో బుధవారం ఉదయం సర్వీస్ రోడ్డులో ఉన్న వ్యక్తులను చెక్ చేయగా వారివద్ద ఉన్న సంచుల్లో బ్రౌన్ కలర్ పార్సిల్ ప్యాకెట్లు లభించాయి. వాటిని చెక్ చేయగా అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. నిందితులు గజానంద్ సుభాష్, గోవింద ధారాసింగ్, శిల్పా గజానంద్‌ను అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి వద్ద ఉన్న 44 కిలోల గంజాయిని సీజ్ చేశామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.